సాక్షి
ప్రకాశం

సోమవారం । 7 । జూలై । 2025



శునక సోయగం

వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం ఒంగోలులోని జిల్లా పశువైద్యశాలకు వివిధ జాతులకు చెందిన శునకాలను టీకాల కోసం తీసుకొచ్చారు. - 8లో..



హైవే పక్కన ఆక్రమణల తొలగింపు

ఒంగోలు సమీపంలోని పెళ్లూరు హైవే వద్ద రోడ్డుకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణాలను అధికారులు తొలగించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

కూటమి వల.. క్యాంపస్ విలవిల

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ట్రిపుల్ ఐటీల ప్రతిష్ట మసకబారింది. ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో బయటి వ్యక్తుల పెత్తనంతో భ్రష్టుపట్టిపోయింది. కాలేజీలో పచ్చ బ్యాచ్‌ను నాన్ టీచింగ్ సిబ్బందిగా నియమించడం ద్వారా క్యాంపస్ ఎత్తివేత కుట్రలకు ప్రభుత్వం తెరదీసింది. ఏడాది పాటు ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్ అద్దె చెల్లించకుండా నిలిపేసింది. కరెంటు బిల్లులూ చెల్లించలేదు. మౌలిక సదుపాయాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. చివరకు క్యాంపస్‌ను ఎత్తివేసింది. ఈ పరిణామాలతో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో చేరాలంటే విద్యార్థులు భయపడిపోయే పరిస్థితి దాపురించింది. తాజాగా జరిగిన కౌన్సెలింగ్‌లో రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా నిలవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

- ఒంగోలు ట్రిపుల్ ఐటీకి నో ఆప్షన్
- 183 ఖాళీలతో రాష్ట్రంలో అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా గుర్తింపు
- కూటమి ప్రభుత్వ నిర్వాకంతో కాలేజీలో చేరడంపై విద్యార్థుల అనాసక్తి
- అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో చిరాకు
- తరచూ క్యాంపస్‌లను మార్చడమే ప్రధాన కారణం
- నిత్యం సమస్యలు సృష్టించడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళనలు



ఒంగోలు ట్రిపుల్ ఐటీ ఎస్ఎస్ఎన్ క్యాంపస్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఉండగా ఒక్కో క్యాంపస్‌కు 1100 సీట్లున్నాయి. ఈ ఏడాది జూన్ 30 నుంచి జూలై 5వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ కౌన్సెలింగ్‌లో మొత్తం 598 సీట్లు ఖాళీగా మిగిలాయి. ఇందులో ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి 183 సీట్లు ఖాళీగా మిగిలి రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా నిలిచింది. గతంలో ఎన్నడూ ఇన్ని సీట్లు మిగలలేదని కాలేజీ ఉద్యోగులు చెబుతున్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో ఈ సీట్లు ఎన్ని భర్తీ అవుతాయో చూడాలి.

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రాజకీయ జోక్యం మితిమీరిపోయింది. రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత కీలక పదవిలో ఉన్న మంత్రికి సన్నిహితుడైన ఒక ప్రైవేటు కాలేజీ అధినేత కాలేజీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం మొదలుపెట్టారు. తన గ్రామానికి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలకు నాన్ టీచింగ్ స్టాఫ్‌గా నియమించినట్లు సమాచారం. అప్పటి వరకు ప్రశాంతంగా కొనసాగిన ఒంగోలు క్యాంపస్‌లో రచ్చ మొదలైంది. ఆ 50 మంది పచ్చ బ్యాచ్‌కు ఎలాంటి విధులు అప్పగించకుండా కూర్చోబెట్టి జీతాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. క్యాంపస్‌లోని ఎగ్జామ్ సెల్ పక్కనే ఉన్న ఒక గదిని డెన్‌గా మార్చుకున్న సదరు ఎల్లో బ్యాచ్ డ్యూటీ చేయకుండా టీవీలు చూస్తూ టైం పాస్ చేసేవారని విమర్శలు వచ్చాయి. అంతేకాకుండా కాలేజీ నిబంధనలకు వ్యతిరేకంగా తమ ఇష్టమొచ్చినప్పుడు కాలేజీకి వచ్చి సంతకాలు చేసేసి వెళ్లిపోయేవారని సమాచారం. దీంతో క్యాంపస్‌లో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే క్యాంపస్ అద్దె చెల్లించలేదు. దాంతో రూ.2.50 కోట్ల అద్దె బకాయి మిగిలిపోయింది. కరెంటు బిల్లు సైతం కోటి రూపాయలకు పైగానే చెల్లించకుండా నిలిపేశారు. దీంతో తరచుగా కరెంటు కట్ చేయడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. మోటార్లు కాలిపోయి నీటి సరఫరా ఆగిపోయినా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. రకరకాల సాకులు చూపి రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను ఎత్తివేశారు. ఇది విద్యార్థుల మీద తీవ్ర ప్రభావం చూపిందని కాలేజీ అధ్యాపకులు చెబుతున్నారు.

ఎస్ఎస్ఎన్‌లో ఆదిలోనే హంసపాదు...

రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఎత్తేసిన తరువాత ఒంగోలులో మిగిలింది ఎస్ఎస్ఎన్ క్యాంపస్. కాలేజీ తరగతులు ప్రారంభం కాకముందే ఇక్కడ మరో పచ్చ బ్యాచ్ రచ్చ రచ్చ చేసి విద్యార్థుల్లో భయాందోళనలు సృష్టించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాలేజీ క్యాంటిన్ నిర్వహణను రెండుగా విభజించి ఇద్దరికి ఇచ్చారు. బాలికల క్యాంటిన్‌ను చవటపాలెం గ్రామానికి చెందిన ఒకరికి, బాలుర క్యాంటిన్‌ను కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చారు. ఈ ఇద్దరూ టీడీపీ నాయకులు, సానుభూతిపరులు కావడం గమనార్హం. గత బుధవారం బాలికల క్యాంటిన్‌ను తెరవడంతో బాలుర క్యాంటిన్ కాంట్రాక్టర్ గొడవకు దిగారు. 20 మంది యువకులను తీసుకొచ్చి కాలేజీలోకి బలవంతంగా ప్రవేశించి బాలికల క్యాంటిన్ నిర్వాహకురాలి భర్త మీద దాడి చేశారు.

క్యాంటిన్‌లోని వస్తువులతోపాటు ఆహార పదార్థాలను రోడ్డు మీద పడేశారు. ఈ దాడితో కాలేజీలో రిపోర్టింగ్ చేయడానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. అసలు క్యాంటిన్ నిర్వహణ బాధ్యతను ఇద్దరికి కట్టబెట్టడం వలన గొడవలు జరిగే అవకాశం ఉందని అంచనా వేయడంలో అధికారులు వైఫల్యం చెందారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌ను కూడా ఎత్తివేసే క్రమంలోనే అధికార పార్టీ పక్కా ప్రణాళికతో గొడవలు సృష్టించిందని కొందరు విశ్లేషిస్తున్నారు.

పోలీసు బందోబస్తు మధ్య క్యాంటిన్ నిర్వహణ..

బాలికల క్యాంటిన్ నిర్వాహకుడి మీద దాడి జరిగిన రోజు రాత్రి జిల్లాకు చెందిన ఒక కీలక ఎమ్మెల్యే నివాసంలో అర్ధరాత్రి వరకు రాజీ ప్రయత్నాలు సాగినట్లు ప్రచారం జరిగింది. అంతా అయిపోయింది. తెల్లారేసరికల్లా ఇద్దరూ కలిసిపోయారని చెప్పారు. ఈ లోపు ఏం జరిగిందో ఏమో కానీ దాడికి గురైన బాలికల క్యాంటిన్ నిర్వాహకులు శుక్రవారం సంతనూతలపాడు పోలీసు స్టేషన్లో కేసు పెట్టినట్లు సమాచారం. అదే రోజు క్యాంపస్‌కు వచ్చిన పోలీసులు విచారణ జరిపి దాడి తాలుకు సీసీ ఫుటేజీలను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం నుంచి పోలీసు బందోబస్తు మధ్య బాలికల క్యాంటిన్‌ను నిర్వహిస్తున్నారని సమాచారం. కాలేజీ క్యాంపస్‌లో పోలీసు పహారా మధ్య విద్యార్థులు భోజనాలు చేయడానికి భయపడిపోతున్నట్లు తెలుస్తోంది. ట్రిపుల్ ఐటీ అధికారుల వైఫల్యం వల్లనే ఇలాంటి దౌర్భాగ్యం నెలకొందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సొంత భవనాలు ఎప్పుడు నిర్మిస్తారో...

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపకపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి తరచుగా క్యాంపస్‌లను మార్చడం. తొలుత ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీలో ఒంగోలు క్యాంపస్‌ను నిర్వహించారు. అక్కడ నుంచి మార్చి ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. అంతా బాగుందనుకుంటున్న విద్యార్థులకు ఐదేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం వచ్చి ఒంగోలు క్యాంపస్‌ను నూజివీడుకు మార్చింది. పిల్లి పిల్లను తీసుకొని ఇంటింటికి తిరుగుతున్నట్లు విద్యార్థులు తరచుగా క్యాంపస్‌లు మారాల్సి రావడంతో చిరాకుకు గురౌతున్నారు. కొత్తగా చేరే విద్యార్థులపై తీవ్రమైన ప్రభావం పడింది.

ఒంగోలులో ట్రిపుల్ ఐటీకి సొంత భవనాలను నిర్మించడం ఒక్కటే దీనికి పరిష్కారమని కొందరు అధ్యాపకులు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ విషయంలో కూడా తరచుగా మాట మారుస్తోంది. తొలుత పామూరులో ట్రిపుల్ ఐటీ కాలేజీని నిర్మిస్తామన్నారు. తాజాగా కనిగిరిలో ట్రిపుల్ ఐటీ కాలేజీ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. ఒకవేళ మార్కాపురాన్ని జిల్లాగా మారిస్తే కనిగిరి.. మార్కాపురం జిల్లా పరిధిలోకి వెళ్లిపోతుంది. అప్పుడు ఒంగోలుకు అసలు ట్రిపుల్ ఐటీ కాలేజీ లేకుండా పోయే ప్రమాదం ఉందని మరి కొందరు వాదిస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోనే ట్రిపుల్ ఐటీ కాలేజీకి సొంత భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

నేడు జువ్విగుంటలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

మర్రిపూడి: మండలంలోని జువ్విగుంట గ్రామంలో సోమవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు గ్రామంలోని దత్తాత్రేయస్వామి ఆలయం ఆవరణలో జరుగుతాయని వారు పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు తమ ఎడ్లను ఉదయం 7.30 గంటల నుంచి ప్రదర్శనలో పోటీకి దించవచ్చని తెలిపారు. విజేతలకు మొదటి నుంచి పదో బహుమతి వరకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.9 వేల చొప్పున ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు సెల్: 9133863219, 9490328505 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

10న మెగా పేరెంట్, టీచర్ సమావేశం

ఒంగోలు సబర్బన్: ఈనెల 10వ తేదీన జరిగే మెగా పేరెంట్–టీచర్ మీటింగును విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. అందుకోసం ప్రిన్సిపాళ్లను, ప్రధానోపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

పీఆర్సీ జాప్యం పై ప్రభుత్వ వైఖరి గర్హనీయం

- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

ఒంగోలు సిటీ: ఉద్యోగుల 12వ పీఆర్సీపై ప్రభుత్వ వైఖరి గర్హనీయమని, మౌనం వీడి వెంటనే కమిషన్‌ను నియమించి, 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆగ్రహం చవిచూడక తప్పదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి తెలిపారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న రఘునాథరెడ్డి మాట్లాడుతూ, 11వ వేతన సవరణ గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నా ఇంత వరకు 12వ వేతన సవరణ కమిషన్ నియామకంపై దృష్టి సారించకపోవడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఇదే వైఖరిని కొనసాగిస్తే మాత్రం ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.రమణారెడ్డి, బి.వెంగళరెడ్డి, చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అశోక్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఉపాధ్యాయవాణి కన్వీనర్ హజరత్తయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మౌలాలి పాల్గొన్నారు.

ఈనెల 31 వరకు ఇంటర్ ప్రవేశాలు

ఒంగోలు సిటీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలను ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఆర్ఐఓ సైమన్ విక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన జూన్ 31వ తేదీతో గడువు ముగియడంతో ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు.



కనిగిరిలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

వీరులారా అల్విదా !

ముస్లింలు పవిత్రంగా భావించే మొహర్రం పండుగను ఆదివారం రాత్రి షహదత్ నామా అల్విదాతో ఘనంగా ముగించారు. జిల్లాలోని పలుచోట్ల పీర్ల చావిడిల వద్ద వేకువజామున పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. వివిధ మకాన్‌లకు చెందిన పీర్లను గ్రామాల్లో కన్నుల పండువగా ఊరేగించారు. ముజావర్లు బాధాప్త గేయాలను ఆలపిస్తూ పీర్లను తిరిగి చావిడిలకు తరలించారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రజా సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ 1100

- జేసీ ఆర్.గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్–1100ను ప్రవేశపెట్టిందని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కాల్ సెంటర్ ద్వారా ప్రజల సమస్యలను ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులు 1100 నంబర్‌కు డయల్ చేసి, తమ సమస్యను విన్నవిస్తే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు రిజిస్టర్ చేసుకుంటుందని వివరించారు. ఆ సమస్యను సంబంధిత అధికారికి పంపి తద్వారా పరిష్కరించేందుకు వీలుకలుగుతుందన్నారు. సమస్యను కాల్ సెంటర్‌లో నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా నిర్ధారణ సందేశం పంపుతారని వివరించారు. ఈ కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఒంగోలు పప్పు బజారులోని సీతారామస్వామి మందిరంలో స్వామివారి కళ్యాణం జరిపిస్తున్న అర్చకులు

జయజానకీ నాయకా..

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వైకుంఠవాసుని దర్శించుకునేందుకు ఆదివారం ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. పలుచోట్ల సత్యనారాయణ స్వామి వ్రతాలు, రామాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి బాబూజీ



బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, చుండూరి రవిబాబు తదితరులు

- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి సభలో జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు టౌన్: దేశంలోని అట్టడుగు ప్రజల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్ రాం నేటి తరానికి ఆదర్శనీయుడిగా నిలిచారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ దేశంలోని బడుగు, బహుజనుల అభ్యున్నతికి, సామాజిక సమానత్వానికి ఆయన చేసిన సేవలు నిరుపమానమని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో తలెత్తుకొని నిలబడేలా చేయాలని భావించి అందుకనుగుణంగా జీవితాంతం పోరాడిన బాబూజీ నాయకత్వ లక్షణాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు మాట్లాడుతూ బహుజనులకు సామాజిక న్యాయం చేసేందుకు, దళితులు, అట్టడుగు ప్రజలకు సమాజంలో సమాన స్థానం కోసం అహర్నిశలు పోరాటం చేశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రాంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ దేశానికి అంబేడ్కర్ ఒక కన్నయితే బాబూ జగ్జీవన్‌రాం రెండో కన్నులాంటి వారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్‌రావు, నగర కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, లీగల్ సెల్ అధ్యక్షులు నగరికంటి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ కార్యదర్శి సయ్యద్ అఫ్సర్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పేరం ప్రసన్న, వాలంటీర్ వింగ్ అధ్యక్షురాలు జీ.మేరీ కుమారి, సిటీ మహిళా అధ్యక్షురాలు బత్తుల ప్రమీల, జిల్లా యువజన విభాగం జాయింట్ సెక్రటరీ ముల్లంగి రవీంద్రా రెడ్డి, 15వ డివిజన్ అధ్యక్షుడు బాలకృష్ణ, 45వ డివిజన్ అధ్యక్షుడు దేవరంపాటి నాగరాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు వేముల శ్రీకాంత్, జీ.శివ, ఆసోది యలమందా రెడ్డి, పిగిలి శ్రీనివాసులు, సంధ్యారాణి, షేక్ జిలాని, ఫణి, నెరసల రాము తదితరులు పాల్గొన్నారు.



పాలంక వీరభద్రస్వామి కరుణ కోసం కాలినడకన వెళ్తున్న భక్తులు



పాలంకేశ్వరుడి ఆలయాల వద్ద క్యూ కట్టిన భక్తులు



సంతాన గద్దె వద్ద నీటి బిందువు కోసం వేచి ఉన్న భక్తురాలు



పాలంక వీరభద్రస్వామి మూలవిరాట్‌కు పూజలు చేస్తున్న అర్చకుడు

వైభవంగా పాలంకేశ్వరుడి తిరునాళ్లు

దట్టమైన నల్లమల అడవిలో కృష్ణానది ఒడ్డున వెలసిన పాలంక వీరభద్ర స్వామి తిరునాళ్ల ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి కరుణ కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న భక్తులు వేలాది మంది వివిధ వాహనాల్లో, కాలినడకన అక్కడికి బయలుదేరి వెళ్లారు. పాలంకేశ్వరుడితోపాటు అక్కడ వెలసిన వీరభద్రస్వామి, గణపతి, పంచముఖ బ్రహ్మ పోతురాజుల ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆ ప్రాంగణంలో ఉన్న బిడ్డలు లేని దంపతులు సంతానగద్దె వద్ద పై నుంచి జాలువారే నీటి బిందువుల కోసం క్యూ కట్టారు. భక్తులు అనారోగ్యానికి గురికాకుండా పాలుట్ల పీహెచ్‌సీ వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అడవి జంతువులకు హాని జరగకుండా, పాలంకకు చేరిన భక్తులను జంతువుల నుంచి సంరక్షించటానికి ఆ శాఖాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సీఐ సీహెచ్ ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్సై పి.చౌడయ్య తన సిబ్బందితో శాంతి భద్రతలను కాపాడారు.

– యర్రగొండపాలెం

శునక సోయగం!



వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ఒంగోలు నగరం సంతపేటలోని జిల్లా పశువైద్యశాలలో ఆదివారం కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. నగర ప్రజలు తమ పెంపుడు కుక్కలు, పిల్లులను తీసుకొచ్చి వ్యాక్సిన్లు వేయించారు. ఈ సందర్భంగా పలు జాతులకు చెందిన కుక్కలు అందచందాలతో ఆకట్టుకున్నాయి. కొన్ని కుక్కలు గంభీరంగా, మరికొన్ని అమాయకంగా, ఇంకొన్ని క్యూట్‌గా ఆకర్షించాయి. జూనోసిస్ డే కార్యక్రమంలో పాల్గొన్న వారంతా వాటిని ఎంతో ఆసక్తిగా తిలకించారు. మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో వారి పెంపుడు కుక్కలతో వచ్చి వ్యాక్సిన్లు చేయించారు. - సాక్షి, ఒంగోలు



లేబ్రడార్ బెల్జియన్ మాలినోయిస్



పగ్ జాతి కుక్క





లేబ్రడార్



డాబర్‌మెన్







సిజ్జు జాతి కుక్కలు

















వ్యాక్సిన్లు వేయించేందుకు పెంపుడు కుక్కలను పశువైద్యశాలకు తీసుకొస్తున్న జంతు ప్రేమికులు













పెంపుడు కుక్కలతో సరదాగా వాటి యజమానులు

జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు



కుక్కలకు వ్యాక్సిన్లు వేస్తున్న పశువైద్యులు

- మనుషుల నుంచి జంతువులకు కూడా..
- వరల్డ్ జూనోసిస్ డేలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రవికుమార్
- పెంపుడు కుక్కలకు టీకాలు

ఒంగోలు సబర్బన్: జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమిస్తాయని, అదేవిధంగా మనుషుల నుంచి జంతువులకు కూడా వ్యాధులు సంక్రమిస్తాయని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి.రవికుమార్ తెలిపారు. వరల్డ్ జూనోసిస్ డేని పురస్కరించుకుని స్థానిక సంతపేటలోని బహుళార్ధ పశు వైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జంతువులతో మానవునికి సహచర్యం ఎంతో ప్రాచీనమైనదన్నారు. ప్రతి మనిషి పౌష్టికాహార అవసరాలకు పశుపక్ష్యాదుల నుంచి ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు, మాంసంపై ఆధారపడి ఉన్నారన్నారు. మనుషులు, పశువుల సహచర్యంతో జూనోటిక్ వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులని పిలుస్తారన్నారు. ఈ వ్యాధులు సుమారు 280 వరకు గుర్తించబడ్డాయని తెలిపారు. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారి 1885 జూలై 6వ తేదీ పిచ్చికుక్క కాటుకు గురైన బాలునికి వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకా మందును విజయవంతంగా ఇచ్చినందున ఆ రోజు నుంచి ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ముఖ్యమైన జూనోటిక్ వ్యాధులు వైరల్‌కు సంబంధించి రేబిస్, మెదడు వాపు, అమ్మవారు (పాక్స్), బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ, ఎబోలా, నిఫా, బ్యాక్టీరియల్ వ్యాధులైన ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, సాల్ నెల్లోసిస్, లిస్టీరియోసిస్, క్షయ (టీబీ), పారాసైటిక్ వ్యాధులు, అమీబియాసిస్, బాలాంటిడియోసిస్, సార్కోసిస్టోసిస్, టీనియాసిస్, ట్రికినెల్లోసిస్, ఆస్కారియాసిస్, స్కేబీస్ (గజ్జి), తామర, హైడాటిడోసిస్, ఆంకై లోస్టోమియోసిస్ లాంటి వ్యాధులు వస్తాయన్నారు. రేబిస్ వ్యాధి పిచ్చికుక్కల కాటు ద్వారా వ్యాప్తిచెందే అతి భయంకరమైన వ్యాధి అని తెలిపారు. పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలను ప్రతి సంవత్సరం వేయించాలని సూచించారు. ఒంగోలు నగరంలోని 518 పెంపుడు కుక్కలను వాటి యజమానులు తీసుకొచ్చి రేబిస్ వ్యాక్సిన్ వేయించారు. పోలీస్ జాగిలాలను కూడా వాటి సంరక్షకులు తీసుకొచ్చి వ్యాక్సిన్ చేయించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత, పశు వైద్యశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైవే పక్కన ఆక్రమణల తొలగింపు

- ఫెన్సింగ్ తొలగించి దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు
- రూట్ ఆఫీసర్ నరసింహారావు హెచ్చరిక



మార్జిన్‌లో బంకు పెట్టిన మహిళకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎన్‌హెచ్ సిబ్బంది

ఒంగోలు సబర్బన్: ఆరు లైన్ల జాతీయ రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే రూట్ ఆఫీసర్ కే నరసింహారావు హెచ్చరించారు. 16వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ దాటి స్పీడ్ రోడ్డు మార్జిన్‌లో నిబంధనలకు విరుద్ధంగా పంక్చర్ షాపులు, దుకాణాలు, హోటళ్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఒంగోలులోని పెళ్లూరు వద్ద హైవే మార్జిన్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలను ఆదివారం హైవే సిబ్బందితో తొలగించారు. దుకాణాలున్న ప్రాంతాల్లో వాహనాలను రోడ్డు మీద నిలిపివేస్తుండటంతో ఇటీవల ప్రమాదాలు జరిగాయన్నారు. స్పీడ్ రహదారి కావడంతో జాతీయ రహదారుల నిబంధనల ప్రకారం ఫెన్సింగ్‌కు నష్టం కూడా చేయకూడదన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైవే మార్జిన్లలో ఎక్కడా వాహనాలు నిలపరాదన్నారు. అలాంటిది ఏకంగా పంక్చర్ షాపులు, టీ, టిఫిన్ హోటళ్లు ఏర్పాటు చేయడం, వాటి వద్ద వాహనాలు నిలుపుతుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అందుకోసం రోడ్డు మార్జిన్లలో దుకాణాలు నిర్వహిస్తున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చి హైవే నిబంధనలను వివరించారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సీహెచ్ నరసింహులు, సిబ్బంది మహేష్, మోహన్‌బాబు, రాబర్ట్, తదితరులు పాల్గొన్నారు.

నగల దుకాణాల్లో మహిళల చేతివాటం

సీఎస్ పురం (పామూరు): కొనుగోళ్ల కోసమని నగల దుకాణాలకు వెళ్లిన మహిళలు చేతివాటం చూపారు. బంగారం, వెండి వస్తువులు కాజేశారు. మండల కేంద్రమైన సీఎస్ పురంలో చోటుచేసుకున్న రెండు సంఘటనలు ఆలస్యంగా వెలుగు చూశాయి. సీఎస్ పురంలోని టీఎస్‌ఆర్ నగల దుకాణానికి ఈ నెల 3వ తేదీ ఇద్దరు మహిళలు వెళ్లారు. బంగారు కమ్మలు కావాలని అడిగారు. దుకాణం యజమాని నాగేశ్వరరావు కమ్మలు చూపిస్తుండగా, వేరే మహిళలు వచ్చి వెండి గొలుసులు చూపించమని అడిగారు. దీంతో వారికి వెండి పట్టీలు చూపిస్తుండగా, బంగారు కమ్మల కోసం వచ్చిన మహిళలు 5 జతల కమ్మలు నొక్కేశారు. వాటి స్థానంలో నకిలీ కమ్మలు పెట్టారు. అనంతరం కమ్మలు తమకు నచ్చలేదని చెప్పి వెళ్లిపోయారు. అనంతరం గమనించిన నాగేశ్వరరావు.. సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా, ఇద్దరు మహిళలు బంగారు కమ్మలు తీసి వాటి బదులు నకిలీ కమ్మలు పెట్టిన విషయం రికార్డయింది. చోరీకి గురైన 5 జతల కమ్మలు 15 గ్రాములు ఉంటాయని, వాటి విలువ రూ.1.50 లక్షల వరకూ ఉంటుందని తెలిపారు. అదేవిధంగా గత నెల 9వ తేదీ సీఎస్ పురంలోనే లక్ష్మీచంద్రిక జ్యూయలరీ దుకాణానికి వెండి పట్టీలు కావాలని వచ్చిన ఇద్దరు మహిళలు పట్టీల జతలను ఒక్కొక్కటిగా సంచిలో వేసుకుని తీసుకెళ్లారు. చోరీకి గురైన వెండి గొలుసులు 1.5 కేజీల బరువు ఉంటాయని, వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని దుకాణం యజమాని నారాయణాచారి తెలిపారు. ఆ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

మొహర్రం వేడుకల్లో టీడీపీ నాయకుల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తాళ్లూరు మండలంలోని రమణాలవారిపాలెం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన మొహర్రం వేడుకల్లో టీడీపీ స్థానిక నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. వేడుకలను మేము చేయాలంటూ ఒక వర్గం, మేమే చేయాలంటూ మరొక వర్గం పట్టుబడటంతో వాదన జరిగింది. మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ ఘర్షణలో గ్రామానికి చెందిన రేషన్ డీలర్ వర్గీయుడికి, పార్టీ గ్రామ అధ్యక్షుడి వర్గీయుడికి తీవ్రగాయాలయ్యాయి. వారిద్దరినీ వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తున్నారు. కొంతకాలంగా గ్రామంలోని టీడీపీ వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పెత్తనం కోసం ఒకరిపై ఒకరు తరచూ దుర్భాషలాడుకోవడంతో పాటు ఘర్షణలకు దిగుతున్నారు. రోజురోజుకీ ఇరువర్గాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుతున్నప్పటికీ పరిష్కరించడంలో టీడీపీ నియోజవర్గ, మండల స్థాయి నాయకులు విఫలమయ్యారు. శనివారం రాత్రి జరిగిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

సింగరాయకొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో ఆదివారం ఉదయం జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న గొరవరపు సునీల్‌కు చెందిన పూరిల్లు దగ్ధమవగా, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే, ఇంట్లో ఉన్న సుమారు మూడు సవర్ల బంగారం, పొదుపు డబ్బులు రూ.70 వేలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించిందని గ్రామస్తులు తెలిపారు. టంగుటూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.



ఊళ్లపాలెంలో దగ్ధమైన పూరిల్లు

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

దొనకొండ: ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన దొనకొండ మండలంలోని వెంకటాపురం జగనన్న కాలనీలో శనివారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్‌ఐ టి.త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటాపురం గ్రామానికి చెందిన జల్దీ వెంగళమ్మను తెల్లబాడు గ్రామానికి చెందిన మరియదాసుకు ఇచ్చి 19 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు పెరిగి 15 సంవత్సరాల నుంచి విడిగా ఉంటున్నారు. వెంగళమ్మ తన పుట్టినిల్లు అయిన వెంకటాపురం గ్రామంలో నివసిస్తూ కూలి పనులు చేసుకుని జీవిస్తోంది. జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుని ఉంటుండగా, ఆరు నెలల క్రితం కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు అపహరించారు. దీంతో రాత్రివేళల్లో చీకట్లో ఒంటరిగా ఉండలేక పుట్టినిల్లు అయిన వెంకటాపురంలో ఉంటుంది. శనివారం సాయంత్రం జగనన్న కాలనీకి వెళ్లొస్తానని తల్లిదండ్రులకు చెప్పింది. రాత్రి 10 గంటల వరకు వెంగళమ్మ ఇంటికి చేరలేదు. ఆమె తల్లిదండ్రులు జగనన్న కాలనీలోని ఇంటి వద్దకు వెళ్లి చూడగా, ఇంట్లోని శ్లాబు ఇనుప రాడ్డుకు చీరతో ఉరేసుకుని చనిపోయి ఉంది. మృతురాలి తండ్రి అంబడి చెన్నయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.